క్లుప్తంగా

ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వాలి


కూలీలతో మాట్లాడుతున్న జయసరిత

పాలకొల్లు సెంట్రల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు జీతాలు వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత కోరారు. మంగళవారం పాలకొల్లు మండలం వాలమర్రు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో ఆమె మాట్లాడారు. తమకు గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని కూలీలు వాపోయారు. వెంటనే వారికి జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని జయసరిత డిమాండ్ చేశారు. అనంతరం కూలీలకు రూ.6 వేలు నగదు, బిస్కెట్లు, డ్రింక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, వెంకటేశ్వరరావు, పసుపులేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం


భగవద్గీత ప్రచారం చేస్తున్న సేవాసమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ భీమవరం వారి ఆధ్వర్యంలో మండలంలోని వెలివల, గొల్లగూడెం, ఆగర్తిపాలెం గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం చేసినట్టు ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం గ్రామాల్లో శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన భగవద్గీత, 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో వాసుదేవ, నాగేశ్వరరావు, రాజు, లోకేష్, మూర్తి, ప్రభాకర్, సత్యనారాయణ, లావణ్య, సుజాత, లక్ష్మీ, భవానీ, యశోద, తారకేశ్వరిలు పాల్గొన్నారు.

పంచ భూతాల్లో భూమికి ప్రాధాన్యత


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: పంచ భూతాల్లో భూమికి అత్యంత ప్రాధాన్యత ఉందని, అందుకే మన పూర్వీకులు భూమిని దేవతగా ఆరాధించే వారని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాదిపతి ఎం రామకృష్ణ, బూసి వెంకటస్వామి, వి.విజయలక్ష్మి, వి.శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ శాంతి థాంలో మదర్ ఫీడింగ్ రూం



మదర్ ఫీడింగ్ రూం వద్ద ఐసీడీఎస్ అధికారులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి థాంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సహకారంతో మదర్ ఫీడింగ్ రూం ఏర్పాటు చేశారు. ఈ రూంను ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.కృష్ణకుమారి మంగళవారం పరిశీలించారు. వాసవీ మాత జన్మస్థలమైన పెనుగొండకు వచ్చే యాత్రికుల్లో చంటి బిడ్డ తల్లులు ఇబ్బందులు పడకుండా ఈ రూం ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజరు నార్కెడమిల్లి జనార్దన్, సూపరువైజర్ జి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త ఎల్ ఉషశ్రీ పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్సీ కార్పొరేషన్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్స్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 29వ తేదీ నుంచి రెండు నెలల పాటు నిర్వహించే శిక్షణకు ఎస్ఎస్‌సీ విద్యార్హత కలిగిన 18 నుంచి 45 ఏళ్ల వయస్సు గలవారు అర్హులన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు సెల్: 91105 77977, 95731 74095, 98482 6647 నంబర్లలో సంప్రదించాలని వసంతరావు తెలిపారు.

దాళ్వా దిగుబడులు లేక దిగాలు

- ముమ్మరంగా వరి కోతలు
- 42 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి


వడలిలో ముమ్మరంగా కోతలు

పెనుగొండ: దాళ్వా దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో వారం రోజులుగా దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. వాతావరణంలో మార్పులుతో మందకోడిగా కోతలు ప్రారంభమైనా, పెరుగుతున్న ఎండల తీవ్రతతో కోతలు ఊపందుకొన్నాయి. పెనుగొండ, ఆచంట, పోడూరు, పెనుమంత్ర మండలాల్లో పెనుగొండలో ముందుగా సాగు ప్రారంభం కావడంతో కోతలు వేగవంతమయ్యాయి. ఆచంట మండలంలో నెమ్మదిగా ప్రారంభమవుతున్నాయి. ఆచంట వేమవరం, వల్లూరు వంటి ప్రాంతాల్లో నారుమడులు ఆలశ్యంగా వేడంతో ఇంకా వరి కోతకు రాలేదు. పెనుమంత్ర మండలంలోనూ కోతలు ప్రారంభమువుతున్నాయి. పెనుగొండ మండలంలో 11,782 ఎకరాల్లోనూ, పెనుమంత్ర మండలంలో 12,103 ఎకరాల్లోనూ ఆచంట మండలంలో 10,600 ఎకరాల్లో, పోడూరు మండలంలో 12,800 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో ఎంటీయూ 1121 వరి రకం అధికంగా సాగు చేశారు. పీఆర్ 126, ఎంటీయూ 1153 రకాలను కూడా సాగు చేశారు. పెనుగొండ మండలంలో గత ఏడాదితో పోల్చుకొంటే దిగుబడులు తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఎకరానికి 55 బస్తాలకు పైగా దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 42 నుంచి 50 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. పెనుగొండ మండలంలో సాగు ముందుగా ప్రారంభం కావడం, తెల్లకంకి వేయడంతో దిగుబడులు తగ్గాయని రైతులు చెబుతున్నారు. తెల్లకంకి వల్ల పాలు పోసుకోకపోవడంతో ఎకరానికి రెండు నుంచి అయిదు బస్తాల వరకు దిగుబడులు తగ్గాయని వాపోతున్నారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యం 75 కేజీల బస్తాకు రూ.1525 చెల్లిస్తున్నారని, తేమ శాతం 17కు ఏమాత్రం పెరిగినా బస్తాకు పాయింట్‌కు రూ.23 కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేమ శాతం తగ్గించేందుకు పాట్లు

మిషన్ కోతతో తేమశాతం అధికంగా ఉండడంతో తేమ శాతాన్ని తగ్గించుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతు సేవా కేంద్రాల్లోనూ, రైసుమిల్లుల వద్ద తేమ శాతంలో తేడాలు చెబుతుండడంతో రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో తేమ శాతం ఆర్ఎస్‌కేలో మెషీన్లు, రైసు మిల్లుల వద్ద మెషీన్లకు ఒకటి నుంచి రెండు శాతం తేడా ఉందంటూ కోత విధిస్తుండడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. తేమ శాతం తేడా లేకుండా చూడాలని అధికారులు ప్రయత్నం చేస్తున్నా షరా మాములే అన్నట్టుంది. రైతులు ఒకటి రెండు రోజుల పాటు ఆరబెట్టుకొని తేమ శాతం తగ్గించుకొనేందుకు పాట్లు పడుతున్నారు.


దొంగగూడెంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


పెనుగొండ రైతు సేవా కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న సిబ్బంది


పెనుగొండలో మిల్లులకు చేరుకున్న ధాన్యం

నేటి నుంచి తిరు నక్షత్ర ఉత్సవాలు


అగ్రహార ఉత్సవం

నరసాపురం రూరల్: ఈ నెల 12న ప్రారంభమైన ఆదికేశవస్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అలంకార తిరుమంజనం, ద్వాదశ ఆరాధన, శ్రీపుష్పయాగం, కేశం అగ్రహారోత్సవం, విడైవిన్నపం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సన్మానించారు. ఈ నెల 23 నుంచి మే 4వ తేదీ వరకు ఎంబెరుమానార్ స్వామి వారి వర్ష తిరు నక్షత్ర ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్ర కుమార్ తెలిపారు.

21 నుంచి ఉచిత శిక్షణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21 నుంచి ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, విద్యార్థినులకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. రెండు నెలలు టైలరింగ్ నేర్చుకున్న విద్యార్థినులకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తామని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 94410 83787, 70176 29841, 73865 29274లో సంప్రదించాలని పేర్కొన్నారు.

స్టేషన్‌పేటలో మంచినీరు వృథా


స్టేషన్‌పేటలో పైప్‌లైన్ లీకైన ప్రాంతం


వృథాగా పోతున్న మంచినీరు

- నెల రోజులుగా పైప్‌లైన్‌కు లీకేజీ
- పట్టించుకోని అధికారులు

నరసాపురం: స్థానిక 30వ వార్డు స్టేషన్ పేటలో మంచినీటి పైప్‌లైన్‌కు లీకేజీ కారణంగా స్థానికులు నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రేస్ నగర్ ప్రాంతానికి కుళాయల ద్వారా మంచినీరు సరఫరా కావడంలేదు. లీకైన నీరు పక్కనే ఉన్న పంట కాలువలోకి వృథాగా పోతోంది. దీంతో ప్రజలు మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. తానే స్వయంగా ఫోన్ చేసి సమస్య చెప్పినా, నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో విషయాన్ని ప్రస్తావించినా మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడంలేదని స్థానిక కౌన్సిలర్ అడిదల శ్యామల వాపోయారు. స్టేషన్ పేట నుంచి సరిపల్లికి వెళ్లే మెయిన్ రోడ్డులో లీకవుతున్న పైప్‌లైన్‌కు మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది ప్లాస్టిక్ కవర్లు చుట్టి చేతులు దులుపుకున్నారని, మరమ్మతులకు అవసరమైన సామగ్రి తమవద్ద లేదని చెబుతున్నారని కౌన్సిలర్ శ్యామల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల తీరుపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన పోషణ్ పక్వాడా కార్యక్రమం


పాలకొల్లు సెంట్రల్ : పోషణ్ పక్వాడాలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వీరా వారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.సత్యవేణి సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లు, టీవీలతో సమయాన్ని వృథా చేయకుండా కుటుంబ సభ్యులతో గడపాలని, తద్వారా మానవ సంబంధాలు పెంపొందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే జాహ్నవి, అంగన్‌వాడీ సిబ్బంది కె.సునీత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో మానవహారం

పెనుమంత్ర: పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం పెనుమంత్ర మండల పరిషత్ కార్యాలయం నుంచి బ్రాహ్మణచెర్వు సెంటర్ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శామ్యూల్, ఎంఈఓ యు.నాగేశ్వరరావు, సీడీపీఓ, సూపర్‌వైజర్స్, ఏపీఎం పద్మ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

యలమంచిలి: బాలింతలు, గర్భిణులు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా సూచించారు. పోషణ్ పక్వాడా ముగింపు కార్యక్రమం మంగళవారం బాడవ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఆహార అలవాట్లపై హసీనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.చంద్రకళ, ఎం వీరకుమారి, జి.ఇంద్రాణి, సహాయకురాలు కె.ధనలక్ష్మి, ఏఎన్ఎం బి.కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ జి.వనజ, ఆశ కార్యకర్తలు డి.సీత, జి.నాగలక్ష్మి, ఉపాధ్యాయుడు పి.శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పెనుమంత్ర : బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో మానవహారం

ధాన్యం అమ్మకాల్లో రైతుల అగచాట్లు


తన బాధను చెబుతున్న రైతు వెంకటేశ్వరరావు

కాళ్ల: ఆరుగాలం కష్టపడి పంట పండించిన వరి రైతు పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుంది. రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవాలన్నా ఇబ్బందిగానే ఉందని తక్కువ ధరకు ఎలా అమ్ముగలమని కాళ్ల మండలం సీసలికి చెందిన రైతు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 1293 రకం వరి సాగు చేస్తే ఇది కామన్ రకంలోకి పెట్టారని, మాయిశ్చర్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన సుమారు క్వింటాల్‌కు రూ.30 రైతుకు నష్టం వస్తుందని వాపోయారు. ఇలా అయితే కొన్నాళ్లకు వ్యవసాయం చేసే రైతే ఉండడన్నారు. సంచులు మంచివి ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పురుగు మందులు కొనాలంటే జీఎస్టీ అడుగుతున్నారని వరి రైతు పరిస్థితి చాలా దయనీయంగా ఉందని వాపోయారు. ఎరువుల ధరలు బాగా పెరిగాయని బస్తా ధర రూ.1800 తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ విధంగా రైతు పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో వ్యవసాయం చేసేందుకు రైతులు ఎవరూ ఉండరని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు.

భక్తాంజనేయస్వామికి పూజలు


భక్తాంజనేయస్వామి

యలమంచిలి: చైత్ర శుద్ధ దశమి సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వాడపల్లి మురళీ కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టివేరు, బంతి, చామంతి పువ్వులతో పుష్పాభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దళితుల సాంఘిక బహిష్కరణ ఉగ్రవాద చర్య

భీమవరం: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయడం ఉగ్రవాద చర్యని దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరం 11వ వార్డులో నిర్వహించిన దళిత ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ల కావస్తున్నా సమాజంలో దళితులపై చిన్నచూపు చూడడం, కుల బహిష్కరణలు వంటివి సిగ్గు చేటన్నారు. దళితుల బహిష్కరణకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాధ్యత వహించాలని సుందరకుమార్ డిమాండ్ చేశారు.

విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

భీమవరం అర్బన్: తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుంకర పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన వసతి, స్కూల్ యూనిఫామ్‌లు, ఉచిత బుక్స్ ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు, రిటైర్డ్ హెచ్‌ఎం బొండా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జి.నర్మద పాల్గొన్నారు.

గడ్డి వాముల దగ్ధం

ఉండి: మండలంలోని చెరుకువాడలో మంగళవారం రెండు గడ్డివాములు ధగ్ధమయ్యాయి. ఆకివీడు అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కోట వీరాంజనేయులు, కోట వెంకటేశ్వరరావులకు చెందిన 1.5 ఎకరాల చొప్పున రెండు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. ఆకివీడు ఫైర్ సిబ్బందికి అందిన సమాచారం మేరకు ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటీన ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పొగతాగి నిర్లక్ష్యంగా పారవేయడంతో అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసినట్లు అధికారులు తెలిపా రు. రెండు గడ్డి వాములు కలిపి రూ.60 వేల నష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారులు అంచనా వేశారు.

వేసవి ఎండ.. ధరల మంట

- పండ్ల ధరలకు రెక్కలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- ఫుట్‌పాత్‌లపై జోరుగా వ్యాపారాలు


కొబ్బరి బొండాల వ్యాపారం

పాలకొల్లు సెంట్రల్: రోజు రోజుకు వేసవి తాపం పెరుగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మే నెలలో ఈ ఉష్ణోగ్రతలు ఇంకెలా ఉంటాయోనని బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్నం వీచే వేడి గాలులకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, తర్బూజ, తాటి ముంజులను స్వీకరిస్తున్నారు. వీటికి గిరాకీతో పాటు ధరలు పెరిగిపోయాయి. నరసాపురం రోడ్డులో దారిపొడవునా పండ్ల దుకాణాలు దర్శనమిస్తున్నాయి.

రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలే

పాలకొల్లు నుంచి భీమవరం, నరసాపురం, తణుకు, దొడ్డిపట్ల వెళ్లే నాలుగు మార్గాల్లో ఎక్కడ చూసినా పండ్ల దుకాణాలు, కొబ్బరిబొండాల వ్యాపారాలు దర్శనమిస్తున్నాయి. పాలకొల్లు లాకు సెంటర్ నుంచి ఉల్లంపర్రు వరకు ఫుట్‌పాత్‌లపై సపోటా, మామిడి, కొబ్బరి, ముంజులు, ఉచ్చకాయలు వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పాలకొల్లు నుంచి నరసాపురం రోడ్డులో ఇరువైపులా ప్రధాన కాలువ, పంట కాలువ, ఇరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు ఉండడంతో చల్లని వాతావరణం కనిపిస్తుంది. కత్తిపూడి దిగమర్రు ఒంగోలు హైవేకి నరసాపురం రోడ్డు లింక్ ఏర్పాటు కావడంతో వాహనచోదకులు ఈ రోడ్డులో చల్లదనానికి సేదతీరుతుంటారు.

ధరలు ఇలా..

పాలకొల్లు నుంచి నరసాపురం రోడ్డులో ఉదయం 10 గంటలకే తాటి ముంజులు వ్యాపారులు విక్రయిస్తుంటారు. ముంజు కళ్లు డజను రూ.60, ముంజుకాయ రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. కొబ్బరి బొండాలు సైజుని బట్టి రూ.25 నుంచి రూ.40 వరకు, లీటర్ బాటిల్ రూ.120కి అమ్ముతున్నారు. పుచ్చకాయలు కేజీ రూ.20 నుంచి రూ.30, ఖర్బూజా కేజీ రూ.30, చక్రకేళీ అరటిపండ్లు డజను రూ.100 నుంచి రూ.120, సపోటా డజను రూ.60 నుంచి రూ.80కు విక్రయిస్తున్నారు. బత్తాయి కేజీ రూ.50, యాపిల్స్ రూ.400 వరకు, ఒక్కో కాయ ధర రూ.20 నుంచి రూ.25 వరకు, దానిమ్మ కాయలు కిలో రూ.180 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు. కివి పండు రూ.20 డ్రాగన్ ఫ్రూట్ ఒక్కటి రూ.60, కిస్‌మిస్ కిలో రూ.120 వరకు విక్రయిస్తున్నారు.

స్థిరంగా ధరలు



వేసవి సీజన్ మొదలు కావడంతో పండ్ల ధరలు ప్రస్తుత మార్కెట్‌లో స్థిరంగా ఉంది. పుచ్చకాయలు ధరలు మొన్నటి వరకు రూ.15 నుంచి రూ.20 వరకు అమ్మేవాళ్లం. నేడు కిలో రూ.25 వరకు విక్రయిస్తున్నారు. పుచ్చకాయలు, తర్బూజ, కివీ పళ్ల గిరాకీ ఎక్కువగా ఉంది.
– ఆకుల శివ ప్రసాద్, పండ్ల వ్యాపారి, పాలకొల్లు


పుచ్చకాయలు కోస్తున్న వ్యాపారి


పెదగోపురం వద్ద జోరుగా ముంజుల విక్రయాలు